

అబ్బురమే ఈ పుష్పం

ప్రజాశక్తి-తాళ్ళపూడి

తాళ్ళపూడిలోని ఒక ఇంటి పెరట్లో మే నెల పుష్పం వికసించింది. సంవత్సరంలో ఒకసారి మాత్రమే పూయడం దీని ప్రత్యేకత. తాళ్ళపూడిలో పూల మొక్కల పెంపక ఔత్సాహికుడు గోకవరపు కుటుంబం అనేక పూల మొక్కలతో పాటు మే పుష్పాల మొక్కలు పెంచుతున్నారు. మే నెల వచ్చిన తరువాత ఇటీవల ఆ పుష్పం వికసించింది. ఈ పుష్పాలను చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.



విరబూసిన మే పుష్పాలు

ఖరీఫ్ సాగుకు ప్రణాళిక సిద్ధం

- 2.07 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ఆర్‌బికెల్లో సిద్ధంగా విత్తనాలు, ఎరువులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధమైంది. వరితో పాటు మినుములు తదితర సాగు మొత్తం 2.07 లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు ఖరీఫ్ ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ప్రధానంగా 1.92 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగును చేసేందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ధాన్యం వరికోతలు పూర్తయిన వెంటనే దుక్కులు దున్ని సాగుకు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో బోర్ల కింద వరి సాగులో వరి నారుమళ్లు వేసేందుకు రైతులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే రైతులు సాగుకు సంబంధించి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే సాగు ప్రారంభిస్తారు. ఇక బోర్ల కింద సాగులో మాత్రం ముందస్తుగా వరి సాగు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వరి నారుమళ్లు వేసేందుకు విత్తనాలను సిద్ధం చేసుకున్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

జిల్లాలో ఖరీఫ్ వరి సాగుకు భూసారాన్ని పెంచేందుకు వినియోగించే పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉన్నాయి, ఈ విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేయనున్నారు. 434 క్వింటాళ్ల జీలు, 150 క్వింటాళ్ల జనుము, 30 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలను అందుబాటులో ఉంచారు. జీలుగ, జనుము విత్తనాలు కిలో ధర రూ.88 కాగా రూ.44కు పిల్లిపెసర కిలో రూ.134 కాగా రూ.67కు అంద జేయనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. అదే విధంగా జిల్లావ్యాప్తంగా వరి విత్తనాలు 38,908 క్వింటాళ్లు అవసరం కాగా 400 క్వింటాళ్ల ఎపి సీడ్స్, 10 వేల క్వింటాళ్లు ప్రైవేటు సంస్థల ద్వారా మిగిలిన వాటిని రైతుల నుంచి రైతులకు సరఫరా చేయనున్నారు. జిల్లాలో ఎంటియు-7029, పిఎల్‌ఎ-1100, బిపిటి-5204, ఎంటియు-1318 వంటి రకాలు అత్యధికంగా సాగు చేస్తున్నారు.



ఖరీఫ్‌కు సిద్ధంగా ఎరువులు

ఖరీఫ్ సాగుకు వ్యవసాయ శాఖ ఎరువులను అందుబాటులోకి తెచ్చింది. జిల్లావ్యాప్తంగా 58,836 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. ఇప్పటికే 23,096 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో అవసరాలను బట్టి ఇంకా ఎరువులు సరఫరా అవుతాయని జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ ప్రారంభమైన తర్వాత విడతలు విడతలుగా ఎరువులు సరఫరా అవుతూనే ఉంటాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు.

ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్ల గురించి ఎస్‌పి, రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులతో కలక్టర్ మాధవీలత గురువారం కలెక్టర్ ఛాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 4వ తేదీ కౌంటింగ్ ప్రక్రియ, అనంతరం ఫలితాలు వెల్లడి క్రమంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం, పోలీసు యంత్రాంగం సంయుక్త కార్యచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. భద్రత తదితర ముందస్తు చర్యలపై అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్స్‌తో శుక్రవారం సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. మూడంచెల భద్రత, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏడు సోలార్ సిసి కెమేరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోటీలో నిలిచిన అభ్యర్థుల ఇళ్ళ వద్ద, రాజకీయ పార్టీల ఆఫీసుల వద్ద సిసి కెమేరాలు ఏర్పాటు చేసి, వ్యక్తులు, సమూహాల కదలికలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి మూడుసార్లు భౌతికంగా హాజరై భద్రత ఏర్పాట్లు పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రతి కౌంటింగ్ హాల్‌కు తప్పకుండా ఒక వీడియోగ్రాఫర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో అభ్యర్థుల జోన్, మీడియా సిబ్బందిని స్పష్టంగా గుర్తించాలన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కౌంటింగ్ ఏజెంట్లకు కేటాయించిన టేబుల్స్‌ను స్పష్టంగా సూచించే బ్యాడ్జీలు ఇవ్వాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా కలర్ కోడ్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రతి రౌండ్‌కు సంబంధించిన డేటాను టేబుల్ చేసిన తర్వాత, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పోలైన ఓట్ల సంఖ్య ఓటరు టర్నౌట్ రిపోర్ట్‌కు క్రాస్ వెరిఫై చేసుకుని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పోల్ సమయంలో భర్తీ చేసిన కంట్రోల్ యూనిట్ల డేటాను ముందుగా కౌంటింగ్ టేబుల్‌లకు అందించాలని, వాటి క్రమ సంఖ్య క్రాస్ చెక్ చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎస్‌పి పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ పాల్గొన్నారు.

ఉచితం న్యాయం కోసం పోలీస్ కంప్లైంట్ అథారిటీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పోలీసు అధికారులు విధులను దుర్వినియోగం చేస్తే సామాన్యుడు జిల్లాస్థాయి పోలీసు కంప్లైంట్ అథారిటీకి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, తగిన న్యాయం పొందవచ్చునని జిల్లాస్థాయి పోలీసు కంప్లైంట్ అథారిటీ ఛైర్మన్, రిటైర్డు జడ్జి ఆర్‌జె.విశ్వనాథం అన్నారు. గురువారం బొమ్మూరులోని వైటిసి ప్రాంగణంలోని అథారిటీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ విశ్వనాథం మాట్లాడుతూ పోలీసుల నుంచి సత్వర న్యాయం అందని సందర్భాల్లో సామాన్యుడికి ఉచితంగా న్యాయం అందించేందుకు జిల్లా స్థాయి పోలీసు కంప్లైంట్ అథారిటీని నియమించినట్లు తెలిపారు. ఏడు జిల్లాలకు సంబంధించి రాజమండ్రి బొమ్మూరులో కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. కమిటీ మెంబర్లుగా రిటైర్డు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.జితేంద్ర, రిటైర్డ్ అడిషనల్ ఎస్‌పి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథం

బి.లక్ష్మీనారాయణ, అడ్వకేట్ సిహెచ్.మన్మథరావు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సామాన్యులను, ప్రజలను పోలీసులు ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే స్వయంగా 9948464363కు ఫోన్ చేయవచ్చని, dpcarajamahendravaram@gmail.com కు మెయిల్ చేయవచ్చునని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 14 కేసులు వస్తే పదింటిని పరిష్కరించామమని తెలిపారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాల్లో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో గురువారం పోలీసు అధికారులు, సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ అపరేషన్ నిర్వహించినట్టు ఎస్‌పి పి.జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ప్రతిరోజు ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలోని అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించిన పరిసర ప్రాంతాల్లో అణువణువూ క్షుణ్ణంగా సోదా చేసి మద్యం, మందు గుండు సామగ్రి, లోకల్ వెపన్స్ అక్రమ నిల్వలపై, అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీస్తామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులను ఉపేక్షించబమని అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 22 మద్యం సీసాలు, పత్రాలు సరిగా లేని 64 బైకులు సీజ్ చేసినట్టు తెలిపారు.

బుద్ధుని బోధనలు అందరికీ ఆచరణీయం

తాళ్లపూడి : నేటి ఆధునిక సమాజానికి బుద్ధుని లాంటి మహాత్ములు ఎంతో అవసరమని తహశీల్దారు శ్రీనివాస్ అన్నారు. గురువారం బుద్ధ పూర్ణిమ సందర్భంగా తహశీల్దారు కార్యాలయం వద్ద శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూర్ణిమ వేడుకలు నిర్వహించారు. జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రజ్ఞ, కరుణ, శీలతో మనిషికి మనసే ప్రధానం అని చెప్పి మధ్యే మార్గాన్ని సూచించిన బుద్ధుని బోధనలు నేటి యువతకు ఆచరణీయమని



బుద్ధునికి వందనం సమర్పిస్తున్న ఉద్యోగులు

అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సీతారామరాజు, విఆర్‌ఒ సంజీవరావు విఆర్‌ఎలు శ్రీలక్ష్మి, రమణమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలు, సన్మాన గ్రహీతలు

విద్యార్థులకు అవార్డులు, ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఎపి పాలీసెట్ ఉచిత శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డుల ప్రదానోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని, బౌద్ధ ధమ్మ పీఠం, పీఠాధిపతి భంతే అనాలయో ఆధ్వర్యంలో బౌద్ధ దమ్మ పీఠంలో ఉచిత పాలీసెట్‌కు శిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు ఆయన అవార్డులు అందజేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతిలో మండలంలో ఫస్ట్, సెకండ్, థర్డ్ సాధించిన విద్యార్థులు, అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రధాన ఉపాధ్యాయులకు శాలువా కప్పి, పూల బొకేలిచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, గ్రామ పెద్దలు మల్లిన శ్రీనివాసరావు, నారా రినా, కోమట్లపల్లి సుబ్బారావు, మల్లిన సత్యనారాయణ, కళారావు, రామేశ్వరరావు, మల్లిన రాజేంద్రప్రసాద్, ఆళ్ల సుబ్బారావు, మద్దిపాటి శ్రీరామచంద్రమూర్తి, నవుడు నాగజ్యోతి, తూతె కృష్ణ, యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె.వెంకటరత్నం, మండల శాఖ జనరల్ సెక్రెటరీ బి.రామారావు, జిల్లా నాయకులు ఐ.రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి రౌండ్‌లో 14 టేబుల్స్ ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో రాజమండ్రి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ జూన్ 4న నన్నయ యూనివర్సిటీలో నిర్వర్తించడం కోసం తగిన మానవ వనరులు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వెలగపూడి నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో చేపట్టనున్న ప్రణాళికలను కలెక్టర్ మాధవీలత వివరించారు. జూన్ 13న జిల్లావ్యాప్తంగా 1,577 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించినట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 16,23,149 మంది ఓటర్లలో 13,13,630 మంది (80.93 శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. జూన్ 4న ఓటింగ్ లెక్కింపు ప్రక్రియ కోసం ప్రతి రౌండ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా విడివిడిగా 14 చొప్పున టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ నలుగురు ఎన్నికల పరిశీలకులను రాష్ట్రానికి కేటాయించినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును కౌంటింగ్ కేంద్రాలలో చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డిఆర్‌ఒ జి.నరసింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆరోగ్యశ్రీ వైద్య సేవల నిలిపివేత తగదు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పేద ప్రజలకు వరప్రదాయిని అయిన ఆరోగ్యశ్రీ వైద్య సేవలను నిలుపుదల చేస్తూ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం దురదృష్టకరమ్మని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వైరాల అప్పారావు మాదిగ, దళిత సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ భవనంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రాణాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ యాజమాన్యం చెలగాటం ఆడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సేవలు నిలుపుదలకు గడువు ఇవ్వాలని, ఒక్కసారిగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలను నిలుపుదల చేయడం వల్ల పేదలు ఇబ్బందులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మ్రరి బాబ్జి, తుమ్మల తాతారావు, ఖండవల్లి లక్ష్మి, సూరి, రామ్‌ప్రసాద్, సుధాకర్, పెదపూడి ఎల్లారావ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-పెరవలి

మండలం అన్నవరప్పాడులో జాతీయ రహదారి పక్కన ఉన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆఖరి రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యాన పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కూచిపూడి, భరతనాట్యం, కోలాటం ప్రదర్శించారు. మహా అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఇఒ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని పెంటపల్లి గ్రామానికి చెందిన, సిబిఐ ఇన్‌స్పెక్టర్ నాగవల్లి శివ గురువారం గ్రామంలోని అమ్మా నాన్న స్వచ్ఛంద సేవా సంస్థలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఉద్యోగరీత్యా సుదూర ప్రాంతాల్లో ఉన్న శివ కుటుంబ సభ్యులు గ్రామంపై మక్కువతో తన భార్య సీమంతం సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ, విద్యార్థులు, యువకులు ఆశయ సాధన కొరకు కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎంత ఉన్నత స్థితికి ఎదిగినప్పటికీ, బంధుమిత్రులు, గ్రామస్తుల అభివృద్ధికి పరస్పర సహాయ సహకారాలు అందించుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రామంలో వృద్ధుల పట్ల తనకున్న మానవత్వాన్ని చాటుకోవడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు, దొడ్డా విజయభాస్కర్, గండికోట రామకృష్ణ, పల్లిబోయిన గంగబాబు, అమ్మ నాన్న స్వచ్ఛంద సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్రి శివరామకష్ణ, పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మానవత సంస్థ ఆధ్వర్యాన గురువారం మజ్జిగ వితరణ చేశారు. చాగల్లు మెయిన్ రోడ్, బస్టాండ్ సెంటర్, శ్రీకాకతీయ కల్యాణమండపం సెంటర్ వద్ద 51వ రోజు ఆత్కూరి నరసింహమూర్తి జ్ఞాపకార్థం ఆయన అల్లుడు కరుటూరి బాలకృష్ణ, పద్మావతి కుటుంబ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చాగల్లు గ్రామపంచాయతీ, చాగల్లు మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరుపున వారికి కృతజ్ఞతలు తెలిపారు.




మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

జ్యోతుల నెహ్రూను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-గోకవరం

టిడిపి జగ్గంపేట నియోజకవర్గం అభ్యర్థి జ్యోతుల నెహ్రూను బిజెపి మండల అధ్యక్షుడు సత్తి వెంకట రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నెహ్రూను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఓటర్లు ఎన్‌డిఎ కూటమికే మొగ్గు చూపినట్లు ధీమా వ్యక్తం చేస్తారు. అనంతరం జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గోకవరం మండలంలో ప్రతి గ్రామంలో 80 శాతంపైన పోలింగ్ జరిగినట్టు మూడు పార్టీల కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బత్తుల వెంకన్న బాబు, ప్రధాన కార్యదర్శి ఇనకోటి బాపన్న దొర, సోషల్ మీడియా కన్వీనర్ కాకి మణికంఠ, మామిడి సత్యనారాయణ, పిల్ల సత్యనారాయణ, కుసుమంచి నాగేశ్వరరావు, ఏగి సాంబశివ, కరిబండి వెంకటేశ్వరరావు, దాసరి నరసింహారావు, గొంతెన బాపిరాజు, రెడ్నం రాఘవ, కటకం బూరయ్య పాల్గొన్నారు.

కార్టూ'నిజం'





వేసవి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-చాగల్లు, పెరవలి

చాగల్లు శాఖా గ్రంథలయం, చంద్రవరం గ్రంథాలయంలో వేసవిజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు నీతి కథలు, వేమన పద్యాలు వివరించారు. విద్యార్థులకు సమకాలీన విషయాలపై జికె టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మాస్టర్ వి.గంగాధరం, గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు పాల్గొన్నారు. చంద్రవరం శాఖా గ్రంథాలయంలో 16 మంది పాల్గొన్నారని గ్రంథాలయాధికారి కె.సుమన్ కుమార్ తెలిపారు. ఈ గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటవిడుపుగా చదరంగం, క్యారమ్స్ ఆడించారు.

పెరవలి మండలంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమం గురువారం ఉదయం 8 గంటల నుంచి 11-30 గంటల వరకూ శిక్షణ ఇచ్చారు. నీతి కథలు వివరంగా చెప్పడం చెస్ క్యారమ్స్ ఆడించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ కె.విశ్వనాథం కె..కామేశ్వరరావు, కె.భవాని, మధులీల, విద్యార్థులు గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ కార్యాలయంలో ఫ్లెక్సీలు

కడియంలో ఎన్నికల కోడ్ ఖతం

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘింనకు గురయ్యింది. గ్రామానికి చెందిన ఒక మండల స్థాయి ప్రజాప్రతినిధి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఊరూ, వాడా ఫ్లెక్సీలు వెలిచాయి. విద్యుత్ స్తంబాలు, ప్రధాన కూడళ్ళు, పలు ప్రదేశాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. అంతేకాక ఒక మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయంలో కూడా ఆయన పుట్టినరోజు రోజు వేడుకలు ఘనంగా జరిగినట్టు, అక్కడి అధికారులు సహకరించినట్లు వినికిడి. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు కడియంలో ఎన్నికల కోడ్ అపహాస్యం కావడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూడటం గమనార్హం.

ఘనంగా పోలేరమ్మ తీర్థం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని దుళ్ల గ్రామ దేవత పోలేరమ్మ తల్లిఅమ్మ వారి తీర్థ మహోత్సవ కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం పెద్ద జాతరతతో ఈ ఉత్సవాలు ప్రారంభం కాగా, బుధవారం చిన్న జాతర నిర్వహించారు. గురువారం తీర్థంతో ఈ ఉత్సవాలకు ముగింపు పలికారు. ఈ ఉత్సవాల్లో భక్తులు ఆలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం ఆలయం వద్ద ఖండవిల్లి వారిచే భరతనాట్యం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మోసం కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - కాకినాడ

చిట్ కట్టించుకుని తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన ఇద్దరు నిందితులకు మూడేళ్ళ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే 2016లో కాకినాడ అపోలో ఆసుపత్రి దగ్గరలో దుర్గా రాధిక చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బ్రాంచ్ నడిపిన పైలా నాగేశ్వర రావు, పైల పవన్‌కుమార్ జగన్నాధ పురానికి చెందిన కాలే సత్యలీలలక్ష్మితో రూ.10 లక్షల చిట్ వాయిదా రూపంలో కట్టించుకున్నారు. అన్ని వాయిదాలూ కట్టినా ఆమెకు చిట్ డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడంతో నాగేశ్వరరావు, పైల పవన్ కుమార్‌లపై ఆమె టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ముద్దాయిలను అరెస్టు చేసి ఛార్జిషీట్ ను దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం కాకినాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో మూడేళ్ళ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ పిపి జి.కమలకుమారి వాదనలు వినిపించారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని శీల గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో తాటాకు ఇల్లు దగ్ధమైంది. స్థానికులు రెవెన్యూ అధికారి వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లక్ష్మీకాంతం తాటాకు ఇంటిలో నివసిస్తుంది. గురువారం ఉదయం లక్ష్మీకాంతం ఉపాధి పనికి వెళ్లిపోయింది. ఉదయం 7 గంటల సమయంలో లక్ష్మీకాంతం ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు ఆ మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినా ఆమె తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో రూ.40 వేల నగదుతోపాటు కాసు బంగారం, ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైందని, నష్టం రూ.1.50 లక్షలు వరకూ ఉంటుందని వీఆర్ఒ వీరభద్రరావు తెలిపారు.

కాలువలో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రౌతులపూడి సమీపంలో ఉన్న ఏలేరు ఎడమ కాలవ వద్ద గురువారం మృతదేహం లభించింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన సికోలు వీరబాబు(38) బుధవారం తన స్నేహితులతో ఓ వివాహానికి హాజరై తిరిగి ప్రయాణంలో ఏలేరు కాలువలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ తన సిబ్బందితో గాలించగా గురువారం మృత దేహాన్ని ఏలేరు కాలువలో గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోయిన దృశ్యం

ఆర్‌టిసి బస్సు, ట్రాక్టర్ ఢీ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆర్‌టిసి బస్సు, ట్రాక్టర్ ఢీకొట్టు కున్నాయి. గురువారం ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కుడి వైపునకు తిరుగుతున్న బస్సుకు పెద్దాపురం వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ రోడ్డు మధ్య లో అడ్డుగా రావడంతో రెండు వాహనాలు ఢీ కొట్టు కున్నాయి. ప్రమాదంలో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి.

పత్రాలు సరిలేని 5 బైకులు సీజ్

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కాకరపర్రులో గురు వారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా 5 బైకులను పత్రాలు సరిగ్గాలేని కారణంగా సీజ్ చేసినట్టు ఎస్ఐ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, పత్రాలు లేని వాహనాలను వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పురుగుల మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

పురుగుల మందు తాగిన యువకుడు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఈనెల 18వ తేదీన రామచంద్ర పురం గ్రామానికి చెందిన పెనుగుల అబ్బులు(27) అదే గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అపస్మారక పరిస్థితిలో పడి పోయి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పురు గుల మందు తాగాడని గుర్తించి అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం రాజాహేంద్రవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. అయితే మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలిం చారు. ఐదు రోజులుగా చికిత్స పొం దుతున్న ఆ యువకుడి ఆరోగ్యం విషమించి గురువారం మృతి చెందాడు. పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - దేవరపల్లి

ఎస్ఇబి దేవరపల్లి స్టేషన్ పరిధిలో గురువారం మండలంలోని యాదవోలు గ్రామం లో చేసిన దాడిలో 20 లీటర్ల నాటుసారా తోపాటు ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడు ల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి. - కడియం

మండలంలోని మాధవ రాయుడుపాలెం గ్రామ శివారు చైతన్యనగర్ రైల్వే గేట్ దగ్గర్లో అక్రమంగా నాటు సారా రవాణా చేస్తున్న కొప్పిశెట్టి రామకృష్ణను అరెస్టు చేసినట్లు కడియం పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 100 లీటర్ల నాటు సారా, మోటార్ సైకిల్ స్వాధీనం చేసు కుని కేసు నమోదుచేసి, కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా కోడిపందాలు, పేకాటలు, సారాయి, మద్యం అమ్మకాలు, సారాయి తయారు చేసిన, అలాగే ఎటువంటి అసాంఘిక కార్య క్రమాలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువకుడి మృతిపై అనుమానాస్పద కేసు నమోదు

ప్రజాశకి - ఆత్రేయపురం

ఒక యువకుడి అనుమానస్పద మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన కైరం నాగ శ్రీనివాస్‌కు(34) వివాహం కాలేదు. తన తండ్రి పోతురాజుతో కలిసి ప్రతి రోజు పొలం పనులు చేసుకుంటూ తిరిగి వస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో బుధ వారం సాయంత్రం ఎప్పటిలాగే పొలం పనులు చేసుకుని ఇంటికి వచ్చారు. అనంతరం తనొక్కడే తిరిగి అదే రోజు రాత్రి బయటకు వెళ్లాడు. ఎంతకూ రాకపోవడంతో తల్లి ఆ యువకుడికి ఫోన్ చేశారు. ఇంటికి వచ్చేస్తానని సమాధానం చెప్పాడు. అయితే ఇంటికి మాత్రం రాలేదు. తెల్లవారి గురు వారం ఉదయం తండ్రి పోతురాజు పొలం పనులకు వెళుతుండగా గ్రామ శివారున తన కొడుకును స్పృహ లేకుండా పడి ఉండడం చూసి గ్రామ పిఎంపి వద్దకు తీసు కెళ్లారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించాడు. తన కుమారుడు శ్రీనవాస్ ఆత్మహత్య చేసుకునే వాడు కాదని ఎవరో తన కుమారుడిని హతమార్చి ఉంటారని అతని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఎస్ శ్రీనివాస్ అమలాపురం నుంచి డాగ్ స్క్వాడ్, క్లూ టీమ్స్ రప్పించి పలు ఆధారాలను సేకరించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలి: కమిషనర్

ప్రజాశక్తి - సామర్లకోట



తాగునీటిని శుద్ధిచేసే ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

మున్సిపాలిటీ నుంచి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వేడి చేసి తాగాలని కమిషనర్ జాస్తి రామారావు తెలిపారు. గురువారం వేసవి జలాశయం, ఫిల్టర్ బెడ్‌లను ఆయన పరిశీలించారు. గత 20 రోజులుగా కుళాయిల్లో పసరు రంగులో తాగునీరు సరఫరా అవుతోంది. దీనిపై మీడియా లోనూ కథనాలు వచ్చాయి. దీంతో స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ బెడ్ చెరువును, ఫిల్టర్ బెడ్ పనితీరును కమిషనర్, మున్సిపల్ ఎఇ, ఇతర అధికారులు పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ చెరువులో పసరు రంగులో ఉన్న జాలాలను వారు పరిశీలించారు. అలాగే ఆ జలాలను శుద్ధిచేసే పద్ధతిని అధికారులు పరిశీలించి జలాలలో కలుపుతున్న ఆలమ్, క్లోరిన్ శాతాలపై సిబ్బందిని ప్రశ్నించి వారికి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కమీషనర్ రామారావు మాట్లాడుతూ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో జలాలు ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో నాచుపట్టి పసరు రంగులోకి మారినట్లు చెప్పారు. ఫిల్టర్ బెడ్ వద్ద అవసరానికి మించి ఆలమ్, క్లోరిన్‌లు ఉన్నప్పటికీ పరిమితిని మించి అధికంగా వాటిని వినియోగిస్తే ఆ నీరు త్రాగే ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే ప్రమాదముందన్నారు. నీటిని ఎంత శుద్ధిచేసినా పసరు కొంచెం ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు కుళాయిల్లో వచ్చే నీటిని కొద్ది రోజులపాటు కాచి, చల్లార్చి తాగాలని ఆయన సూచించారు.

వృథాగా పోతున్న తాగునీరు

ప్రజాశక్తి - జగ్గంపేట



పైపు నుంచి లీక్ అవుతున్న తాగునీరు

ప్రజల అవసరాల కోసం సరఫరా చేస్తున్న తాగునీరు వృథాగా పోతుంది. గత కొన్ని రోజులుగా ఈ తంతు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడాన్ని పలువురు తప్పుపడు తున్నారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో బావవరం వద్ద ఏలేరు నీటిని శుద్ధి చేసి మండలంలోని అన్ని గ్రామాలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. గోవిందపురం గ్రామానికి వెళ్ళే పైపు లైన్ లీకు అవుతూ నీరు ఉవ్వెత్తున ఎగసి పడుతుంది. దీంతో ఆ రహదారిలో ప్రయాణించే వారు ఆ నీటితో తడిచి ముద్ద అవుతున్నారు. ఇలా ఫిల్టర్ వాటర్ పైపు లైన్ గ్రామ మొదట్లో లీకు అవ్వడంతో గోవిందపురం గ్రామానికి నీరు అందడం లేదు. పైపులైన్ నిర్వహణ కాంట్రాక్టర్ లీకులు అరికట్టక పోవడంతో నీరు సరిపోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం ప్రజలు సంబంధిత అధికారులకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఫలితం ఉండటం లేదు. అధికారులు స్పందించి పైపులైన్‌కు శాశ్వత మరమ్మతులు చేపట్టి గోవిందపురం గ్రామానికి పూర్తి స్థాయిలో తాగునీటిని అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి - గండేపల్లి



ఆశ్రమం వద్ద సరుకులు అందిస్తున్న విద్యార్థులు

ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెద్దాపురంలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో రూ.25 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులను పంపిణీ జరిగింది. ఆదిత్య కళాశాల విద్యార్థులు తమ తమ గృహాల నుంచి బియ్యాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఈ విధమైన సేవా కార్యక్రమంలో భాగస్వాములు అవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు బి.రాంబాబు, ఐవి.వీరాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునికి ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట



వీరభద్రరావు దంపతులకు సత్కారం చేస్తున్న అభిమానులు

ప్రముఖ న్యాయవాది కొర్లమండ వీర భద్రరావు సాధించిన హ్యాట్రిక్ విజయం సామర్లకోట పట్టణానికే తలమానికం అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం రాత్రి సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూడోసారి కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా విజయం సాధించిన ప్రముఖ న్యాయవాది కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి దంపతులకు ఆత్మీయ అభినందన కార్యక్రమం జరిగింది. లయన్స్ అధ్యక్షులు కానుబోయిన విజయ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రెసిడెంట్ చిత్తులూరి వీర్రాజు, సినీ దర్శకులు కెబి.ఆనంద్ మాట్లాడారు. ప్రజా సేవలో ఎల్లవేళలా ముందుండి అవసరాల్లో ఉన్న వారికి చేదోడుగా ఉంటున్న న్యాయవాదులు కొర్లమండ దంపతుల సేవలు అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ అధ్యక్ష పదవిని అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. సన్మానగ్రహీత వీరభద్రరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీస్సులు, జీవిత భాగస్వామి, కుటుంబం సహకారంతో తాను ఇప్పటి వరకూ ఎన్నో విజయాలు, సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వీరభద్రరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్య క్రమంలో లయన్స్ కార్యదర్శి బడుగు సీతా రామరాజు, నాయకులు మేకా శ్రీనివాస్, సేపేని సురేష్, కర్రి ఆదినారాయణ రెడ్డి, గుండు శంకర రావు, ప్రత్తి రామ లక్ష్మణమూర్తి, అందుగుల జార్జిచక్రవర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డిఇ రత్నాలరావు తెలిపారు. 11కెవి సూరంపాలెం ఫీడర్, సూరంపాలెం ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతులతోపాటు, 11కెవి లైన్‌పై ఉన్న చెట్లు కొమ్మలను తొలగించడం జరుగుతుందన్నారు. కావున శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సూరంపాలెం, రామేశ్వరంపేట యర్రంపాలెం గ్రామాలతోపాటు, సూరంపాలెం అగ్రికల్చర్ బోర్లు, సూరంపాలెం పరిశ్రమలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన వెల్లడించారు.

ర్యాలీలు, బాణసంచా పేలుళ్లు నిషేదం

ప్రజాశక్తి - గండేపల్లి



అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న సిఐ

ఎన్నికల కోడ్ ఉన్నందున కౌంటింగ్ పూర్తయ్యేంతవరకు ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు, బాణాసంచా పేలుళ్లను నిషేధించినట్లు సిఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామ పెద్దలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం గండేపల్లి గ్రామ శివారు రంగంపేట పోవు రోడ్డులో ఉన్న ఆర్కాఫైర్ వర్క్సును సందర్శించారు. ప్రస్తుతం 144, సెక్షన్ 30 అమలులో ఉందని, జూన్ 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ర్యాలీలకు అనుమతులు లేవన్నారు.

బిసిసిఐ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - గండేపల్లి

పర్యావరణ పరిరక్షణ కోసం బిసిసిఐ చేస్తున్న కృషి అభినందనీయమని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మీడియా మేనేజర్, జాతీయ పర్యావరణ మిత్ర గంగాధర్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఐపిఎల్-24 క్రికెట్ టోర్నీ ప్లే ఆఫ్‌లో ప్రతీ డాట్ బాల్‌కి 500 మొక్కలు నాటడానికి నిర్ణయం స్వాగతనీయమని అన్నారు. ఐపిఎల్ ద్వారా ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలనే పిలుపు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు.

కౌంటింగ్ నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జెఎన్‌టియులో జూన్ 4న జరిగే పెద్దాపురం నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్‌ఒ జె.సీతారామారావు కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వారి కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారన్నారు. 15 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కార్యాలయం ఎఒ సుబ్రహ్మణ్యం, పెద్దాపురం, సామర్లకోట తహశీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు పద్మావతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లపై చెత్త వేస్తే జరిమానా'

ప్రజాశక్తి - కాకినాడ

చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా తప్పదని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు హెచ్చరించారు. గురువారం ఆయన ఎంహెచ్‌ఒ డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి నగరంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. అలాగే ఇంటింటికి చెత్త, తడి పొడి చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పూడికతీత పనులను వేగవంతం చేశామన్నారు. వర్షాలు పడే లోపుగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. డీ-సిల్టేషన్ పనులను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవివర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమేరాల ఏర్పాటు

రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.తేజ్‌భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్ట్రాంగ్ ల వద్ద రెండు సిపి కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటినీ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్ భరత్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్ల పై రాజకీయ పార్టీల, అభ్యర్థుల రెవిన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కోసం అసెంబ్లి నియోజక వర్గ పరిధిలో ని పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఇవిఎమ్ యూనిట్స్ భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్, పోస్టల్ బ్యాలెట్ లు, స్టాట్యూటరీ మెటీరియల్ భద్రపరిచే క్రమంలో పక్క పక్కనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 13 పోలింగు ప్రక్రియ ముగిసిన అనంతరం ఇవిఎమ్ యూనిట్స్, స్టాట్యూటరీ మెటీరియల్ , పోస్టల్ బ్యాలెట్ పత్రాలు స్ట్రాంగ్ రూమ్ లకి భద్రపరచి అభ్యర్థుల, వారి ప్రతినిధుల సమక్షంలో సీల్ వేశామని అన్నారు. అదే విధంగా ఆ మూడు రూములకి కూడా డోర్, కిటికీ లను చెక్కలను కొట్టి మూసి ఉంచామన్నారు. ఓట్లు లెక్కించే జూన్ 4 వ తేదీ ఉదయం 5 గంటలకి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు. ఆలోగా తప్పనిసరిగా హాజరు కావాలని పరిశీలకులు వారి సమక్షంలో ఉదయం 5.30 గంటలకు కౌంటింగ్ సిబ్బంది టేబుల్ ఎలాట్ మెంట్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. స్ట్రాంగ్ ల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటినీ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణా చేస్తున్నట్లు తెలిపారు. అక్కడ అభ్యర్థులు, ఏజెంట్స్ నిరంతరం పరిశీలించడం జరుగుతుందనీ అన్నారు. శుక్రవారం నుంచి అభ్యర్థులు, ఏజెంట్స్ నేరుగా స్ట్రాంగ్ రూమ్ లను తనిఖీ చేసే అవకాశం ఉందని, ఆమేరకు పోలీసు, గేజిటెడ్ అధికారి ఎస్కార్ట్ తో పంపనున్నట్లు తెలియ చేశారు. మూడు షిఫ్ట్ లలో తహశీల్దార్లు ను నియమించినట్లు తెలిపారు. నియోజక వర్గం లో 3,033 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లో సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా సమావేశం గురువారం నిర్వహించారు. జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోటీలో ఉన్న అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు పాటించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించి వారికున్న సందేహాలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నివత్తి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా అత్యంత పారద ర్శకంగా నిర్వహించుటలో తమ వం తు సహకారం అందించాలని ఎన్నికల్లో పోటీ లో ఉన్న అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రతిని ధులను కోరారు. సార్వత్రిక ఎన్నికలకు సంబం ధించి మొదటి ఘట్టం పోలింగ్ జిల్లా లో ప్రశాంతంగా ముగిసిందని అం దుకు రాజకీయ పార్టీలు ప్రతినిధులు తమ వంతు సహకారం తోడ్పాటు అందించారన్నారు. అదే స్ఫూర్తిని ఓ ట్ల లెక్కింపు ప్రక్రియలో జిల్లా యంత్రాంగానికి అందించి కౌంటింగ్ ప్రక్రి యను కూడా విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల పోలింగ్ రోజున పోలింగ్ అనంతరం పలు జిల్లాలలో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటన నేపథ్యంలో ఎన్నికల సంఘం భద్రత చర్యలను మరింత కట్టుదిట్టం చేసిందన్నారు. అటువంటి చర్యలు పునరావతం కాకుండా కౌంటింగ్ ప్రక్రియ సజావు గా జరగడానికి ప్రతి ఒక్కరు సహా య సహకారాలు అందించాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో పారదర్శకం గా నిర్వహించడానికి అన్ని చర్యలతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కౌంటింగ్ కొరకు ఎటువంటి ఫిర్యాదులు లేని సమర్థవంతమైన అధికార సిబ్బందిని నియమించామన్నారు. సిస్టం సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఇవిఎంలు ద్వారా కౌంటింగ్‌లో పెద్దగా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేవన్నారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు కౌంటింగ్ సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ కార్యక్రమాలు ర్యాండమైజేషన్ ప్రక్రియతో విధులు కేటాయించామన్నారు. కౌంటింగ్ రోజున ఉదయం ఏడు గంటలకే స్ట్రాంగ్ రూములను కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో తెరుస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6:30 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు సంతప్తి చెందిన తరువాతనే తదుపరి ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇవిఎంల్లో నిక్షిప్తమై ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని స్వయంగా పరిశీలించుకునేందుకు అభ్యర్థులు కూడా హాజరుకావాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శ కంగా పనిచేస్తున్నది లేనిదీ కేవలం పోటీలో ఉన్న అభ్యర్థి పరిశీలించు కునే అవకాశం లేనందున ఆయన తరపున ఏజెంట్లు స్వయంగా పరిశీ లించుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బందిని 25శాతం రిజర్వులో ఉంచామనిస్పష్టం చేశారు. ప్రాధాన్యత క్రమంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారీగా కౌంటింగ్ ఏజెంట్లకు సిట్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఏజెంట్లు ప్రతి రౌండు నివేదికలో తప్పనిసరిగా సంతకాలు చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పోస్టల్ బ్యాలెట్ , సర్వీస్ ఓటర్ల ఓట్ల లెక్కింపు సంబంధించి రెండు చొప్పున టేబుళ్ల ఏర్పాటు చేస్తామన్నారు. వీటిలో ఒక టేబుల్ పోస్టల్ బ్యాలెట్ కొరకు రెండవది సర్వీస్ ఓటర్ల కొరకు ఏర్పాటు చేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ సర్వీస్ ఓటర్లు, ఇవిఎంల్లో ఓట్లు లెక్కింపు సమాంతరంగా జరుగు తుందని ఆయన స్పష్టం చేశారు ఇదే సరళిలో పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓటర్ల ఓటింగ్ లెక్కింపు కొరకు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి టేబుల్ కు రౌండ్ కు 500 ఓట్లు చొప్పున పోస్టల్ బ్యాలెట్ లెక్కించే విధంగా ఏర్పాటు చేశామన్నా రు ఒక టేబుల్ కు కేటాయిం చిన ఏజెంట్ మరో టేబుల్ లోని వివరాలు సేకరణకు ప్రయత్నించ రాదన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో ఆర్‌ఒతో పాటు సహాయ రిటర్నింగ్ అధికారి, సూక్ష్మ పరిశీలకులు, గెజిటెడ్ స్థాయి సూపరింటెండెంట్ వారికి సహాయ కులుగా విఆర్‌ఒలు ఉంటారన్నారు. ఇసిఐ మార్గద ర్శకాల ప్రకారం ఒక సైడుగా ఏ పని జరగదని అంతా అత్యంత పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో సిబ్బం ది తప్పిదాలు చేస్తే ఎన్నికల సంఘం తీసుకుని చర్యలు, శిక్షలు చాలా కఠినంగా ఉంటాయన్నారు. కౌంటింగ్ నిరంత రాయంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లావ్యా ప్తంగా 819 సర్వీస్ ఓటర్లు ఉండగా వీరిలో ఇప్పటివరకు 262 మంది సర్వీస్ ఓట్లు వినియోగించుకు న్నారన్నారు. మిగిలినవారు విని యోగించుకునే సమయం ఇంకా ఉందన్నారు. యువత ఎన్నికల ప్రక్రియలో హింసాత్మక సంఘటన లకు పాల్పడి తమ భవిష్యత్తును అంధకారం చేసుకోరాదని ఆయన సందర్భంగా హితవు పలికారు.

జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి మొదటి ఘట్టం పోలింగ్ ప్రక్రియ సజావుగా జరగడానికి ఒకవైపు తీసుకున్న ముందస్తు జాగ్రత్తచర్యలు తోపాటు గా మరోవైపు రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యర్థులు మంచి సహకారం అందించారన్నారు. ఇదే పంథాను, స్ఫూర్తిని కౌంటింగ్ ప్రక్రియ లోను కొనసాగించి ప్రశాంత వాతా వరణంలో ఎన్నికల ప్రక్రియను ముగించడానికి తోడ్పాటునందించాలని కోరారు. స్ట్రాంగ్ రూములో వద్ద సెక్యూరిటీ పరంగా సెంట్రల్ పారా మిలటరీ దళాలు ఆయుధాలతో సహా భద్రత కల్పిస్తున్నాయన్నారు. రెండో దశలో రాష్ట్ర ఆర్మీడ్ పోలీస్ బలగాలు మూడో దశలో సివిల్ పోలీసులు మూడంచెల భద్రత కల్పిస్తారన్నారు. కౌంటింగ్ సెంటర్ కి వచ్చే వాహనాల ను చెక్ చేసి అనుమతిస్తామన్నారు. ఇసిఐ మార్గదర్శ కాలు ప్రకారం అత్యంత భద్రతను పాటిస్తున్నట్లు వెల్లడించారు. ఫలితాలు అనంతరం గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలు ఊరేగింపులు పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు అదేవిధంగా బాణసంచా కాల్పులు, లూజు పెట్రోల్ అమ్మకాలు పై నిషేధం ఉం దన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోనికి ధ్రువీకరించబడిన పాస్లు జారీ చేసిన కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామన్నారు. కళాశాల చుట్టుపక్కల స్టైరైన్ జోన్‌గా ప్రకటించామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని ఎవరు గుంపులుగా గుమిగూడ రాదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి ఈ మహత్తర కార్యక్రమా న్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. గతంలో పరిస్థితులు వేరని ప్రస్తుతం ఎన్నికల సంఘం నిర్ణయించిన మార్గదర్శకాలు అందుకు భిన్నంగా ఉన్నా యన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడి ఇబ్బందికర పరిస్థితులు సృష్టించేందుకై ఎవరు ప్రయత్నించరాదనిస్పష్టం చేశారు. ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకున్నామని అన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద మీడియా సెంటర్ ను ఏర్పాటు చేసి రెగ్యులర్గా మానిటరింగ్ చేస్తామన్నారు. పలు సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం నిఘా చర్యలు కొనసాగు తాయన్నారు. 214 సిసి కెమెరాలు ఏర్పాటుచేసి ప్రక్రియను చిత్రీకరిస్తామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ప్రజలకు భరోసాను కల్పించేందుకై కవ్వింపు చర్యలు హింసాత్మక సంఘటనలకు పాల్పడ కుండా తమ వంతు సహకారం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఏడు నియోజకవర్గాల ఆర్వోలు ప్రజా ప్రతిని ధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్‌పి ఎస్.శ్రీధర్